శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# వైభవంగా గంధ మహోత్సవం





**వెంకటాచలం, అక్టోబరు 23, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గంధాన్ని శనివారం రాత్రి బంగ్లా వద్ద నుంచి మేళతాళాలు, ఫకీర్ల కుమ్ము వాయిద్యాలతో ఘనంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ముందు కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ కాంతుల నడుమ బాణసంచా పేలుస్తూ స్వామివారి గంధం ఊరేగింపు జరిగింది. గ్రామ ఉత్సవం అనంతరం ఆదివారం ఉదయం గంధాన్ని దర్గా వద్దకు తీసుకొచ్చారు. దర్గాలో కడప పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ చదివి గంధాన్ని దర్గాకు పూసి అనంతరం భక్తులకు గంధాన్ని పంచారు. గంధం తీసుకు నేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా కొండపైన పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. నెల్లూరు నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వసతులను అధికారులు ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డ్ వారు చలివేంద్రాలు, దాతలు కొంతమంది అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గత రెండేళ్లుగా కోవిడ్ కారణంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అధికారులు ఏర్పాటు చేయడంతో ఈ ఏడాది భక్తుల సంఖ్య ఘననీయంగా తగ్గింది.

**దర్గాలో ఎ.ఆర్.రెహమాన్ ప్రత్యేక ప్రార్థనలు...** ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎ.ఆర్.రెహమాన్ గంధ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెహమాన్‌ను కలిసేందుకు, కరచాలం చేయడానికి, ఫోటోలు దిగేందుకు అధిక సంఖ్యలో అక్కడికి వచ్చిన భక్తులు పోటీపడ్డారు. దీంతో పోలీసులు బందోబస్తు నడుమ రెహమాన్ ప్రార్థనలు చేసి బయల్దేరారు.

గంధ మహోత్సవంలో భాగంగా నేడు చిన్న గంధ మహోత్సవాన్ని జరపడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఉదయం స్థానిక యాదవులు చిన్న గంధాన్ని నిర్వహిస్తారు. ఈ గంధ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

## ఎంతటివారినైనా వదిలేది లేదు..

### -పౌరసరఫరాలసంస్థ కుంభకోణంపై మంత్రి

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త** జిల్లా పౌరసరఫరాలసంస్థ కార్యాలయం వేదికగా జరిగిన కుంభకోణంలో సంబందం వున్న ఎంతవారినైనా..ఎంత స్థాయిలో వున్న అధికారులైనా వదిలేది లేదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరులోని జిల్లాపరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల ప్రతినిధులు బెజవాడ గోవిందరెడ్డి, చిరసాటి కోటిరెడ్డిలు పౌరసరఫరాలసంస్థలో జరిగిన నిధుల మళ్ళింపు విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వానికి ధాన్యం తోలిన రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు..రవాణాఛార్జీలు.. గోదవున్ల అద్దెలు..హమాలీల కూలీలు.తదితర రూ. 30 కోట్ల రూపాయలు పక్కదారి పట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ వారు దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. వరుసగా ఆడిట్‌లు జరుగుతున్నా ఇంతపెద్ద మొత్తంలో నిధులు ఎలా పక్కదారి పట్టాయో చెప్పాలని వారు ప్రశ్నించగా మంత్రి కాకాణి ఇందుకు స్పందిస్తూ విచారణాధికారి అయిన జేసీ రోణంకి కూర్మనాధ్‌ను ఈ విషయమై చెప్పాలంటూ సూచించారు. సమావేశంలో పాల్గొన్న జేసీ గతంలో ఆడిట్ జరిగినా క్యాష్‌బుక్‌కు-బ్యాంక్ స్టేట్‌మెంట్లకు సరిపోతుండడంతో ఎటువంటి అనుమానం రాలేదన్నారు. తాజాగా జరిగిన ఆడిట్‌లో ఒక్క ఓచర్ లభించడంతో నిధుల మళ్లించిన విషయం బయటపడిందన్నారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ రికార్డులున్న 2007 నుండి జరిగిన లావాదేవీలపై విచారణ జరుపుతున్నామన్న రోణంకి కూర్మనాధ్ అంతకుముందు జరిగిన లావాదేవీలపై విచారణ జరిపేందుకు అప్పటి బ్యాంక్ రికార్డుల కోసం బ్యాంక్‌లకు సంబందించిన ఉన్నతాధికారులను సంప్రతిస్తున్నామన్నారు. పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ అకౌంట్‌లో పడ్డ నగదు ఎక్కడెక్కడికి వెళ్లిందన్నది విచారణ జరుపుతున్నామన్న ఆయన రెండు మూడు రోజుల్లోనే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పౌరసరఫరాలసంస్థ కార్యాలయంలో రెండుసార్లు అగ్నిప్రమాదాలు జరగడం..తాజాగా భారీగా నిదులు పక్కదారిపట్టడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై జేసీ విచారణ జరుపుతున్నారన్న మంత్రి జరిగిన కుంభకోణంలో ఎంతటివారున్నా..ఎంతస్థాయి అధికారులున్నా ఎవరినీ వదిలేది లేదన్నారు.

## టిడిపి నేత మలిశెట్టిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తే సహించం



**కావలి అక్టోబర్23 ప్రభాతర్త** టిడిపి రాష్ట్ర కార్యదర్శి కావలి మాజీ ఏఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లుపై రౌడీషీట్ ఓపెన్ చేస్తే సహించేది లేదని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఆదివారం కావలి ఒన్‌టౌన్ సర్కిల్ పోలీసు స్టేషన్‌కి టిడిపి నేతలతో మాలేపాటి వెళ్లారు. మలిశెట్టిపై రౌడీషీట్ ఓపెన్‌చేశారన్న కథనాలపై వాస్తవాలు చెప్పాలని కావలి ఒన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కొండవీటి శ్రీనివాసరావును మాలేపాటి అడిగారు. వాస్తవాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రౌడీషీట్ ఓపెన్‌చేశారా లేదా చెప్పాలంటూ సిఐని మాలేపాటి ప్రశ్నించారు. అసలు సిసలైన నేరస్తులు వైసిపి పార్టీలో ఉన్నారని ముందు వారిపై రౌడీషీట్ ఓపెన్‌చేస్తే కావలి నియోజకవర్గ ప్రజలు హర్షిస్తారని మాలేపాటి అన్నారు. అధికార పార్టీ నేతలకు తలొగ్గి తప్పుడు కేసులు పెట్టొద్దని పోలీసులను వారు కోరారు. అధికారపార్టీకి సంబంధించి సింగిల్ నెంబర్ ఆటగాళ్లు, క్రికెట్‌బెట్టింగ్ ఆటగాళ్లు ఉన్నారని వారిమీద చేతనైతే ముందు కేసులు పెట్టమని మాలేపాటి అన్నారు. మా పార్టీ నేతలపై ఒక్కరిమీద రౌడీషీట్ ఓపెన్ చేసినా రానున్న మా పాలనలో పదిమందిపై రౌడీషీట్ ఓపెన్ చేయిస్తామని హెచ్చరికలు చేశారు. పోలీసు అధికారులు న్యాయపాలన సాగించాలన్నారు. ప్రజల ప్రశంసలు పొందాలన్నారు. ఈ సందర్భంగా సిఐ కొండవీటి శ్రీనివాసరావు మాలేపాటికి సర్దిచెబుతూ తాము మలిశెట్టి వెంకటేశ్వర్లు పై రౌడీషీట్ వంటి చర్యలు చేపట్టలేదని హామీ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాలపాటి ఈ విషయాలు వెల్లడించారు. మాలేపాటి వెంట టిడిపి నేతలు మన్నం రవిచంద్ర, ఏగూరి చంద్రశేఖర్,దావులూరి దేవకుమార్ మాదిగ,ఎస్‌కె.మస్తాన్, గొట్టిపాటి రాము, తదితర టిడిపి నేతలు పాల్గొన్నారు.

## జనసేనతో ప్రజలకు సుపరిపాలన



**నెల్లూరు అక్టోబరు 23 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో జనసేనకు అవకాశం ఇస్తే పదేళ్లల్లో నెల్లూరులో ప్రేరేపితమైన దౌర్జన్యాలు.దోపిడీలు కట్టడిచేసి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని...సుపరిపాలన అందిస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నెల్లూరు సంతపేట రాగిచెట్టుసెంటర్ వద్ద వైసీపీ ప్రభుత్వ వైఫల్యం-ప్రజల బతుకు భారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాలలో దేవతలు నరకాసురుని తప్పించి దీపాలు వెలిగించినట్లు వైసీపీ రాక్షసరాజ్యం నుండి కాపాడి ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు పవన్‌కళ్యాణ్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజలందరూ వైసీపీ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్న గునుకుల కిషోర్ ఈ నేపథ్యంలో అందరూ ఆలోచించి మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. కాగా ఈ కార్యక్రమంలో హరి, అలేఖ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## 25న కొండబిట్రగుంట ఆలయం మూత

బిట్రగుంట,అక్టోబర్23,ప్రభాతవార్తః బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్తానం ఈనెల 25వతేదీన సూర్యగ్రహణం కారణంగా దేవస్తానానికి దైవదర్శనంకోసం భక్తులను అనుమతించరని గ్రహణ సమయంలో దేవస్తానం మూసివేయబడుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి,కార్యనిర్వహఫాదికారి రాధాకృష్ణలు తెలిపారు.కావున భక్తులు ఈవిషయాన్ని గమనించాల్సిదిగా వారు కోరారు.

# రైతులకు మేలు జరిగేలా వ్యవసాయ సమావేశాలు



నెల్లూరు కలెక్టరేట్, ఆక్టోబరు 23 ప్రభాతవార్త వ్యవసాయ సలహామండి సమావేశాలు మొక్కుబడిగా కాకుండా రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ అజెండా ప్రకారం ముందుకు వెల్తూ వారికి మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం ఆదివారం నెల్లూరులోని జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరయిన మంత్రి కాకాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ సలహామండలి సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించకుండా రైతులకు మేలు చేసేలా జరపాల న్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాలో వ్యవసాయ పనిముట్ల మంజూరుకు సంబందించిన సబ్సిడీ విషయం పెండింగ్‌లో వుందన్న ఆయన త్వరలోనే ఈ సబ్సిడీని విడుదల చేస్తామన్నారు. ఇక వ్యవసాయశాఖలో ఖాళీగా వున్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన ప్రతి రైతు భరోసాకేంద్రంలో అదనంగా ఒక వ్యవసాయశాఖ సిబ్బందిని నియమించనున్నామన్నారు.

**ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం :** దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ 2022-23 ఖరీఫ్ సాగుకు వ్యవసాయశాఖ సమాయత్తం కావాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతుభరోసాకేంద్రాలలో సిద్దంగా వుంచాలన్న ఆయన ఈ-క్రాప్ ప్రక్రియ నూటికి నూరు శాతం పూర్తిచేసి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఇక జిల్లా పౌరసరఫరాలసంస్థలో జరిగిన అవినీతిపై సమగ్రంగా విచారణ జరిపించాలన్న ఆయన రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు, రవాణాఛార్జీలు,హమాలీలు కూలీలు ఇప్పించాలన్నారు.

**పటిష్టంగా ఈ-క్రాప్ ప్రక్రియ :** కలెక్టర్ చక్రధర్‌బాబు సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పటిష్టంగా జరుగుతోందన్నారు. కాగా రైతుభరోసాకేంద్రం స్థాయిలో జరిగే జిల్లా వ్యవసాయ సలహామండలి సమావే శాలలో చర్చకు వచ్చేసలహాలు,సూచనలు, సమస్య లపై వ్యవసాయశాఖ అధికారులుప్రత్యేకదృష్టి సారించాలన్నారు.

**వ్యక్తిగతంగా పనిముట్లు మంజూరు : కందుకూరు ఎమ్మెల్యే**

సమావేశంలో పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీపై అందజేసే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను వ్యక్తిగతంగా అందజేయాలన్నారు. ఇక సీహెచ్‌సీ గ్రూపులకు అందజేసే యంత్రపరికరాలకు సంబంధించి సబ్సిడీని విడుదల చేయాలన్న ఆయన రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతుభరోసాకేంద్రాలలో సిద్దంగా వుంచాలన్నారు. కాగా ఈ సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, డిఆర్వో వెంకటనారాయణమ్మ, జలవనరులశాఖ సీఈ హరినారాయణరెడ్డి, ఎస్ఈ కృష్ణమోహన్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ రమణారెడ్డి, నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, టీజీపీ స్పెషల్ కలెక్టర్ ఎంవీసు ధాకర్, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావ్, జిల్లాపరిషత్ సీఈఓ చిరంజీవి, ఆర్‌డిఓలు మలోల (నెల్లూరు), శీనానాయక్ (కావలి), కరుణకుమారి (ఆత్మకూరు) తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహం ఎవరిది?



**వెంకటాచలం, అక్టోబరు 23, ప్రభాతవార్త:** ఈ నెల 22వ తేదీ ఉదయం కనుపూరు చెరువులో లభ్యమైన మృతదేహం ఎవరిదనేది అంతుబట్టడంలేదు. మనుబోలు మండలం వడ్లపూడి గ్రామానికి చెందిన పాలేటి సతీష్ కనబడడంలేదని వారి తల్లిదండ్రులు 19వ తేదీన మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో 22వ తేది వెంకటాచలం మండలం వెంకటాచలంలోని కనుపూరు చెరువు వద్ద ఉబ్బిపోయి ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉన్న మృతదేహం లభించింది. దీంతో కనబడకుండా పోయిన వ్యక్తి ఇతనేనని కుటుంబసభ్యులు వచ్చి మృతదేహం వద్ద పరిశీలించగా తమ కుమారుడేనని సతీష్ తల్లి రమాదేవి, బంధువులు తెలపడంతో వెంకటాచలం సీఐ జగన్మోహన్‌రావు వారి వద్ద ఫిర్యాదు తీసుకుని అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని మనుబోలు మండలంలోని వడ్లపూడి గ్రామానికి చెందిన సతీష్ తల్లిదండ్రులకు అప్పజెప్పారు. వారు సాంప్రదాయ పద్ధతిలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మృతదేహాన్ని ఖననం చేశారు. అంతవరకు బాగానే ఉన్నా ఆదివారం ఉదయం సాంప్రదాయబద్దంగా చిన్న కరమంత్రాలు కూడా నిర్వహించారు. అక్కడ నుంచి కథ మొదలైంది. ఒక్కసారిగా సినిమా తరహాలో కనబడకుండా పోయిన వ్యక్తి సతీష్ వడ్లపూడి గ్రామానికి రావడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు అవాక్కయ్యారు. నిన్న అంత్యక్రియలు నిర్వహించిన వ్యక్తి తిరిగి రావడమేంటని ప్రజలు విస్తుపోయారు. ఇలాంటి సంఘటనలు సినిమాలో చూస్తుంటాం కానీ నిజంగా రావడంతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో సతీష్ తన స్నేహితుల వద్ద ఉన్నానని తల్లిదండ్రులకు తెలిపారు.

# సిద్ధలయ్య కోనపై భూ బకాసురుల కన్ను?

**- దేవుని కొండ పరిసరాల్లో మైనింగ్‌కు అనుమతులు**
**- అధికారుల తీరుపై భక్తుల మండిపాటు**
**- ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన గ్రామస్థులు**



**సైదాపురం, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంకు కూతవేటు దూరంలో ఉన్న చరిత్ర కలిగిన సిద్ధలయ్య కోనపై భూ బకాసురుల కన్ను పడింది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం సమీప భూములలో మైనింగ్ తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేయడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. సిద్ధలయ్య కోనకు పరిసర ప్రాంతాల్లో ఖనిజ సంపద ఉండడంతో దానిని దోచుకునేందుకు అధికారుల వద్ద మైనింగ్ యాజమాన్యాలు అనుమతులు పొందడంతో గ్రామస్థులు అధికారులపై మండి పడుతున్నారు. ఈ విషయమై సైదాపురంలోని పంచాయతీ కార్యాలయంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు డేగా రమణయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అధ్యక్షుడు డేగా రమణయ్య, జనరల్ సెక్రటరీ అబ్బూరు వేణుగోపాలరావులు మాట్లాడుతూ సిద్ధలయ్య కోనలో వెలిసియున్న సిద్ధేశ్వర స్వామి వారి దేవస్థానం తాలూకా సంబంధించి ఆ ప్రాంతంలో ఉన్న సర్వే నెంబరు 529 బి4 లో మైనింగ్ చేసుకునేందుకు మండల తహసీల్దారు ఎన్‌వోసీ ఇవ్వడం జరిగిందని, దీంతో ఉన్నత న్యాయస్థానం నుంచి మైనింగ్ నిలిపివేసేందుకు స్టే ఆర్డర్‌ను తీసు కురావడం జరిగిందని తెలిపారు. దేవస్థానం కొండలకు 200 గజాలు దూరం కూడా లేకుండా అధికారులు మైనింగ్ అనుమతులు ఇవ్వడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వం ఎటువంటి పర్యావరణానికి ఇబ్బంది లేకుండా మైనింగ్ అనుమతులు ఇవ్వాలని చెబుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా అనుమతులు ఇస్తున్నారన్నారు. సిద్ధలయ్య కోనలో ప్రతి సంవత్సరం కార్తీక మాసంలోని నాలుగు సోమవారాలు ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, దీంతో స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకోవడం జరుగుతుందని, అదేవిధంగా ప్రతి రోజూ ఇక్కడ స్వామివార్లకు నిత్య నైవేద్యంతో పాటు దీపారాధనలు జరుగుతూ ఉంటాయని, అటువంటి ఈ ప్రదేశంలో మైనింగ్ అనుమతులు ఇవ్వడం వలన బ్లాస్టింగ్ నిర్వహించినప్పుడు భక్తులకు అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. అయినప్పటికీ అధికారులు ఇటువంటి ప్రదేశంలో మైనింగ్ లీజు ఎందుకు ఇచ్చారో అర్థం కావడంలేదని వాపోయారు. మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని దేవస్థాన కమిటీ సభ్యులను అధికారులను కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టరు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుని దేవస్థానం ప్రాంతాన్ని కాపాడాలని కోరారు. ఈ విషయమై తహసీల్దారు పి.కృష్ణను వివరణ కోరగా 2018లో ఈ ప్రాంతంలో మైనింగ్ కొరకు అప్పటి తహసీల్దారు ఎన్‌వోసీ ఇవ్వడం జరిగిందని, దీంతో మైనింగ్ నిర్వహించేందుకు మైనింగ్ యాజమాన్యాలు 2020 సంవత్సరానికి అన్ని అనుమతులు తెచ్చుకున్నారన్నారు. ఒకవేళ న్యాయస్థానం స్టే ఇచ్చి ఉంటే తాను వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# మొదటిపంటకు 8.46 లక్షల ఎకరాలకు సాగునీరు

**-సోమశిల ప్రాజెక్ట్ ద్వారా 5.51 లక్షల ఎకరాలకు..**
**-కండలేరు ద్వారా 2.95 లక్షల ఎకరాలకు..**



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త** జిల్లాలో 2022-23 సంవత్సరానికి సంబంధించి మొదటిపంటకు 8.46 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఆదివారం జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం తీర్మానించింది. ఇందులో సోమశిల ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని 5,51 లక్షల ఎకరాలకు (55.1 టిఎంసి) నీటిని, కండలేరు జలాశయం ద్వారా నెల్లూరు-తిరుపతి జిల్లాలకు చెందిన 2.95 లక్షల ఎకరాలకు (29.5 టిఎంసి) నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. మొత్తం రెండు జలాశయాల ద్వారా 8.46 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఏబీ సమావేశంలో తీర్మానించడం గమనార్హం.

**చివరి భూముల వరకు సాగునీరు :** మంత్రి కాకాణి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సోమశిల-కండలేరు జలాశయాల నుండి 2022-23 మొదటిపంటకు 8.46 లక్షల ఎకరాలను సాగునీరు అందించనున్నామని.. ఇందుకోసం 84.6 టిఎంసి నీటిని కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించడం జరిగిందన్నారు. జిల్లాలోని సాగునీటి-తాగునీటి అవసరాలను దృష్టిలో వుంచుకొని ప్రణాళికాబద్దంగా నీటిని విడుదల చేస్తామన్న ఆయన చివరి భూములకు సాగునీరు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకోవడంతోపాటు వారి సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని జిల్లాలో గడచిన మూడేళ్లలో 14 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అలాగే జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న సంగం-నెల్లూరు బ్యారేజ్‌లను పూర్తిచేశామన్న ఆయన ఇందుకు సంబందించి జిల్లా రైతాంగం తరపున ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇక సమావేశంలో ప్రజాప్రతినిధులు సాగునీటి రంగానికి సంబంధించి ఇచ్చిన సూచనలు-సలహాలను పరిగణలోకి తీసుకుంటామన్న మంత్రి వారు పేర్కొన్న కాలువల మరమ్మత్తులు-ఆధునీకరణ పనులు తదితరాలు త్వరగా పూర్తిచేయాలంటూ అధికారులకు ఆదేశాలివ్వడం జరుగుతుందన్నారు. సాగునీటి విడుదల సమయంలో కాకుండా ముందునుండే కాలువల పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక జిల్లాలో వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

**సమృద్ధిగా వర్షాలు : కలెక్టర్** సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు పడడం వల్ల సోమశిల-కండలేరు జలాశయాలు నీటిని నిండాయన్నారు. ఈ నేపథ్యంలో మొదటిపంటకు సంబంధించి పూర్తి ఆయకట్టుకు నీరు ఇవ్వడం జరుగుతోందన్న ఆయన గ్రామ స్థాయిలో నీటిసంఘాల సభ్యులను-నీటిపారు దలశాఖ అధికారులను సమన్వయం చేసి కేటాయించిన నీటిని ఆయకట్టు చివరివరకు అందిస్తామన్నారు. కాగా ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వితపు బాల సుబ్రమణ్యం, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి (కందుకూరు), రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి (కావలి), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి (ఉదయగిరి)లతో పాటు విజయాడైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులయిన బెజవాడ గోవిందరెడ్డి, చిరసాని కోటిరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, డిఆర్వో వెంకటనారాయణమ్మ, జలవనరులశాఖ సీఈ హరినారాయణరెడ్డి, ఎస్ఈ కృష్ణమోహన్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ రమణారెడ్డి, నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, టీజీపీ స్పెషల్ కలెక్టర్ ఎంవీసుధాకర్, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావ్, జిల్లాపరిషత్ సీఈఓ చిరంజీవి, ఆర్‌డిఓలు మలోల (నెల్లూరు), శీనానాయక్ (కావలి), కరుణకుమారి (ఆత్మకూరు) తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో నేడు స్పందన లేదు..

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** దీపావళి పండుగ పురస్కరించుకొని నేడు (సోమవారం) స్పందన కార్యక్రమం వుండదని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవుదినం అయినందున సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరగదన్న ఆమె జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలన్నారు.

## అంగన్‌వాడీ భవనం మరమ్మత్తులకు 5 లక్షలు



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని ఖాజనగర్‌లోని 7 వవార్డులో వున్న అంగన్‌వాడీ సెంటర్ మరమ్మత్తులకు నాడు-నేడు ద్వారా 2.50 లక్షలు మంజూరు అయినట్లు కౌన్సిలర్ షకిలాబేగం,వైసిపి నాయకులు డాక్టర్ అల్లాబక్ష తెలిపారు.అలాగే మరో 2.50 లక్షలు ఫర్నిచర్‌కి మంజూరు అయినట్లు తెలిపారు.ఈ సంద్భంగా కౌన్సిలర్ షకిలాబేగం,డాక్టర్ అల్లాబక్ష కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి,చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఉర్దూస్కూల్ హెడ్‌మాష్టార్ మస్తానయ్య, వైసిపి నాయకులు గౌస్,ముష్టాక్,జావిద్, తదితరులు పాల్గోన్నారు.

## వన్‌టౌన్ సిఐని సత్కరించిన వడ్లమూడి దర్శిగుంట

**కావలిరూరల్ అక్టోబర్23 ప్రభాతవార్త:** కావలి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొండవీటి శ్రీనివాసరావును కావలి వైసిపి నాయకులు మరియు కావలి ఫ్రూట్స్ అసోసియేషన్ గౌరవ అద్యక్షులు, మాజీ కౌన్సిలర్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, అద్యక్షులు దర్శిగుంట మహేంద్రలు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో పూలమాలవేసి ఘనంగా సత్కరించడం జరిగింది.



## జాతీయరహదారిపై ప్రమాదం - వ్యక్తి మృతి

**ఆత్మకూరు,అక్టోబర్23,ప్రభాతవార్త:** మండలంలోని వాసిలి-కోలగట్ల మధ్య జాతీయ రహదారిపై జరిగిన కారు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చేజర్ల మండలం ఆదూరుపల్లి సమీపంలోని తనయపాళెంకు చెందిన చంద్రశేఖర్(46)అర్ధరాత్రి దాటిన తర్వాత మర్రిపాడు నుండి నెల్లూరుకు కారులో ప్రయాణిస్తుండగా కోలగట్ల సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డు దిగి చెట్టుకు ఢీకొన్న సంఘటనలో చంద్రశేఖర్ తలకు తీవ్రమైన గాయమైంది. చికిత్సకై ఆత్మకూరుప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతిచెందాడు. ఆత్మకూరు ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

## ముమ్మరంగా ఎమ్మెల్సీ ఓట్లు చేర్పులు



**వింజమూరు,అక్టోబర్23,ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో టిడిపి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లును చేర్పించేందుకు స్థానిక టిడిపి నేతలు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ఆదివారం మండలంలోని చాకలికొండ, జనార్ధనపురం, రావిపాడు, కాటేపల్లి గ్రామాల్లో గ్రాడ్యుయేట్ లను కలిసి ఓట్లు చేర్పిస్తున్నారు. ఈసందర్భంగా మండల టిడిపి కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డిమాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఉదయగిరి నియోజకవర్గ మాజీఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆదేశాల మేరకు తెలుగుదేశంపార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, విద్యాప్రధాత , సేవా దృక్పదం కలిగిన యువకుడైన కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు బాలయ్య, జిల్లా టిడిపి కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ టిడిపి కన్వీనర్ గూడా నరసారెడ్డి, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, నాయకులు పాములపాటి మాల్యాద్రినాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, ఆరికొండ శ్రీనివాసులు, అంకిపెద్దయ్య, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## మహేష్‌కు అభినందనలు

**వింజమూరు,అక్టోబర్23,ప్రభాతవార్త:** వింజమూరు మండలం బుక్కాపురంకుచెందిన కానాల మహేష్‌ను ఆదివారం కలిగిరి సిఐ సాంబశివరావ్, వింజమూరు ఎస్ఐ జంపానికుమార్‌లు అభినందించారు. ఈసందర్భంగా కలిగిరి సిఐ సాంబశివరావ్ మాట్లాడుతూ బుక్కాపురంకు చెందిన మహేష్ చిన్నవయసులోనే హైకోర్టు అడ్వికేట్‌గా ఎన్‌రోల్‌మెంట్‌కావడం చాలా సంతోషకరమన్నారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మహేష్ తన విద్యాభ్యాసం మొత్తం వింజమూరు మండలంలో జరిగి తన మండలానికి , గ్రామానికిమంచి చేయాలన్న తలంపుతో ఉన్నత చదువులు చదివి లా పట్టాను పొంది తన కలలను నెరవేర్చుకున్నాడన్నారు. ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని , వృత్తిరీత్యా సీనియర్ల సూచనలు, సలహాలు పాటించాలని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని, పుట్టిన ఊరికి , మండలానికి మంచి పేరుతేవాలని వారు ఆకాంక్షించారు.



## కొత్తూరులో ఘనంగా యాదవ్ భవన్ ప్రారంభం



**నెల్లూరురూరల్, అక్టోబరు23 ప్రభాతవార్త** రూరల్ పరిధిలోని కొత్తూరులో ఆదివారం పోలుబోయిన తిరుపాలయ్య పేరిట యాదవ్ భవన్ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యాదవ్ ఎంప్లాయిస్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి సిటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యదవ విద్యార్థులు విద్యావేత్తలుగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో సామాజిక భవనాన్ని ఏర్పాటు చేశానన్నారు. యాదవుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. విద్యాభివృద్ధితో ఉన్నత స్థాయి లభించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. శాసనమండలి మాజీసభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ, యాదవులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య మాట్లాడుతూ, జిల్లాలో యాదవభవన్‌ను మొట్టమొదటిసారిగా నిర్మించిన ఘనత ఎంప్లాయిస్ సొసైటికే దక్కుతోందన్నారు. సొసైటి సభ్యులను అభినందించారు. విద్యార్థుల హాస్టల్ వసతి ఏర్పాటుకు ఒక ఫ్లోర్‌ను నిర్మించి ఇస్తామని ఆల్ఫా హాచరీస్ అధినేత దూడల సుధాకర్‌యాదవ్ ప్రకటించారు. ఈకార్యక్రమంలో సొసైటి వ్యవస్థాపకులు జి.శ్రీనివాసులు. ఆర్థిక కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు వెంగయ్య, రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా అద్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి యాదవ ఉద్యోగులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

# సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఈనెల 27న జిల్లాకు వస్తున్న నేపధ్యంలో అందరూ సమన్వయంతో ఆయన పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనపై ఆయన ఆదివారం నెల్లూరులోని జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లాస్థాయి అధికారులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి నేలటూరులోని ఏపిజెన్‌కో శ్రీదామోదరం సంజీవయ్య ధర్మల్‌పవర్‌స్టేషన్‌కు వస్తారన్నారు. రెండు గంటలపాటు సీఎం అక్కడ వుంటారన్న ఆయన బహిరంగసభలో పాల్గొని వెల్తారన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన శంఖుస్థాపనలు-ప్రారంభోత్సవాలు వుంటే అందుకు సంబందించిన జాబితా అందజేస్తే మంత్రితో మాట్లాడి నిర్ధారిస్తామన్నారు. ఏపిజెన్కో-రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని ముఖ్యప్రణాళికాధికారి సంక్షిప్త సమాచారంతో నోట్స్‌ను తయారుచేయాలన్న కలెక్టర్ వాటిని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు అందజేయాల్సి వుంటుందన్నారు. ఇక హెలీప్యాడ్ వద్ద స్వాగతం-వీడ్కోలు కార్యక్రమాలలో పాల్గొనే ప్రజాప్రతినిధుల జాబితా, ముఖ్యమంత్రి పర్యటనా కార్యక్రమాలు త్వరలో ఖరారు చేస్తామన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన విధులు అప్పజెప్పిన అధికారులు అందరూ అందుబాటులో వుండాలన్న చక్రధర్‌బాబు వారికి అప్పజెప్పిన పనులను సజావుగా పూర్తిచేయాలన్నారు. కాగా ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, డిఆర్వో వెంకటనారాయణమ్మ, జలవనరులశాఖ



సీఈ హరినారాయణరెడ్డి, ఎస్ఈ కృష్ణమోహన్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ రమణారెడ్డి, నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, టీజీపీ స్పెషల్ కలెక్టర్ ఎంవీ సుధాకర్, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావ్, జిల్లాపరిషత్ సీఈఓ చిరంజీవి, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, ఆర్‌టీసీ ఆర్ఎం శేషయ్య, ఏపిజెన్‌కో చీఫ్ ఇంజనీర్ నాగరాజు, పంచాయితీరాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌డిఓలు మలోల (నెల్లూరు), శీనానాయక్ (కావలి), కరుణకుమారి (ఆత్మకూరు) పాల్గొన్నారు.

# మత్స్యకారేతర ప్యాకేజితో మండల వాసుల్లో ఆనందం

**ముత్తుకూరు,అక్టోబర్23,ప్రభాతవార్త:** 16ఏళ్ళగా కలలు కంటున్న మత్యకారేతర ప్యాకేజిని ఈనెల 27వతేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుదని వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అన్నారు. ఆదివారం ముత్తుకూరు మండలంలోని గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఏవైనా సమస్యలు వుంటే తమదృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు .దువ్వూరు వారిపాళెంనుంచి గుంటకట్ట వరకు 44 లక్షల రూపాయల అంతర్గత సిమెంటురోడ్డును మంత్రి ప్రారంబించారు.అభివృద్ది సంక్షేమమే ద్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో మండలకన్వీనర్ మెట్టా.విష్ణువర్ద నరెడ్డి, సర్పంచ్ సన్నారెడ్డి హారతి,ఎం.పి.టి.సి మూగా కీర్తి,స్తానిక నాయకులు దయాకర్‌రెడ్డి, పాముల.శ్రీనయ్య,అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ సూపర్‌వైజర్లపై భగ్గుమంటున్న విమర్శలు
## జగనన్న లక్ష్యాలకు తూట్లు

**కలువాయి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలని చెబుతున్న అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ సక్రమంగా లేదని సాక్షాత్తు జడ్‌పిటిసి సభ్యులు అనీల్‌కుమార్‌రెడ్డి సర్వసభ్య సమావేశంలో మాట్లాడడంతో సర్వత్రా చర్చినీయాంశం అయింది. పలు ప్రజా ప్రతినిధులు కూడా కొన్ని గ్రామాలలో అంగన్‌వాడీ సెంటర్ల పనితీరు బాగులేదని సూపర్‌వైజర్లు కన్నెత్తైనా చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కలువాయి మండలంలోని అంగన్‌వాడీ సెంటర్ల పనితీరును పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సర్పంచ్‌లు కూడా వ్యాఖ్యానిస్తున్నారు.గర్భవతులు,బాలింతలు,చిన్నపిల్లలు, ఉంటున్న అంగన్‌వాడీ సెంటర్‌లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించాల్సిన సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు జడ్‌పిటిసి సభ్యులు స్ధానిక మహిళా పోలీసులతో కలిసి పలుసెంటర్లు తెరిగి అక్కడ పరిస్థితులు బాగులేక పోవడం,ప్రజలు ఆరోపణలు చేయడం అత్యంత బాధకరంగా ఉందని అన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు హరిజనవాడలలో,గిరిజన కాలనీలలో అత్యంత దయనీయంగా ఉన్నాయని జడ్‌పిటిసి అసహనం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ స్పందించి,అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలిస్తే పేద వారికి న్యాయం జరిగే అవకాశం ఉందని,జగనన్న లక్ష్యం నెరవేరుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** డిఎస్‌సీ-2008 అభ్యర్దులు ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిఎస్‌సీ-2008 నోటిఫికేషన్ మేరకు ఎంపికైన తాము 30 శాతం డీఈడీకి కేటాయించడం వల్ల నష్టపోయామని..ఉమ్మడి హైకోర్టు ఆదేశాలతో ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా నియమితులైన తమను ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన కామన్ ఉత్తర్వులను వెంటనే అమలుపరచి సర్వీస్‌తో కూడిన రెగ్యులర్ ఉద్యోగాలలో నియమించాలన్నారు.




## టపాసుల దకాణాలకు అనుమతులు తప్పనిసరి

**కొండాపురం,అక్టోబర్23,ప్రభాతవార్త:** దీపావళి సందర్భంగా కొండాపురం మండలంలో టపాసులు అమ్మే దుకాణదారులు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్.ఐ ఎస్.కె ఖాజావళి తెలిపారు.టపాసులు అమ్మే షాపులు ఊరుబైట మైదానంలో ఏర్పాటుచేసుకోవాలని అన్నారు.దుకాణదారులు ముందస్తుగా తమషాపులు ఎక్కడపెడుతున్నారో వారి పూర్తివివరాలు తమకు అందజేస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు.అనుమతులు తీసుకోకుండా టపాసులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## బాదుడులో జగన్ రికార్డు ఇంటూరి నాగేశ్వరరావు

**ఉలవపాడు, అక్టోబరు 23, ప్రభాతవార్త** ధరలు, పన్నులు పెంచడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టిస్తున్నారని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఉలవపాడు మండలంలోని వీరేపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలు పంపిణీ చేశారు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కనిపించిన భూములను కొట్టేయడం, ప్రతిపక్ష పార్టీ వారిని బెదిరించడం, అక్రమాలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడే పనిగా జగన్ పరిపాలనలో కొనసాగుతుందని విమర్శించారు. ఒక్క రాజధానిని నిర్మించలేని ముఖ్యంత్రి మూడు రాజధానులు అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. రూ.లక్షల కోట్ల అప్పులు తెచ్చి సొంత కార్యకర్తలకు పప్పు బెల్లాలగా పంచి పెట్టడం తప్ప జగన్ సాధించింది ఏమి లేదని అన్నారు. ఉలవపాడు మండలంలోని వైసీపీ నేతల ఆగడాలను ప్రజలు భరించలేకపోతున్నారని, టీడీపీ కార్యాకర్తలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. ఈ దుర్మార్గాలను ప్రజలు ఇప్పటిదాకా భరిస్తూ వచ్చారని, రాబోయే ఎన్నికల్లో వారంత ఆ పార్టీ నేతలకు బుద్ధిచెప్పేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. ప్రధానంగా ఎసీ స్,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు జగన్ పాలనలో తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మోదుగుల గురవయ్య, పార్టీ నాయకులు లక్కం రాజు నరేష్, కాకర్లపూడి ఆదినారాయణ రాజు, లక్కం రాజు, శ్రీహరి, కాకర్లపూడి నాగరాజు, దంతులూరి నాగరాజు, కందగడ్డల సత్యనారాయణ, మర్లపాటి ఐజాక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నారుమడులు పెంచుకోండి

**చేజర్ల,అక్టోబర్23,ప్రభాతవార్త:** మండలంలోని రైతులు ముందస్తుగా వరిసాగుకు సంబంధించి నారుమడులు పెంచుకోవాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు. సోమశిల జలాశయం నుంచి దక్షిణ కాలువకు నీటిని విడుదల చేస్తామని మార్చి 15వరకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ముందుగా నారుమడులు పెంచుకోవాలని ఆయన సూచించారు. దక్షిణ కాలువ నుంచి నీటిని చెరువులకు , మైనర్‌కాలువలకు సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని దక్షిణ కాలువ ఆయకట్టు కలిగిన రైతులు ఈ అవకాశాని న్ సద్వినియోగంచేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## 25నుంచి రిలే నిరాహారదీక్షలు

**చేజర్ల,అక్టోబర్23,ప్రభాతవార్త:** తమ న్యాయమైన సమస్యల పరిష్కారంకోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా అధికారులు స్పందించడం లేదని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25నుంచి చేజర్ల తహసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు భారతీయ జనతాపార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం చేజర్ల పోలీసులకు వినతిపత్రం అందజేశారు. వావిలేరు, తూర్పుకంభంపాడు, గొల్లపల్లి, చిత్తలూరు గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామని వెంటనే పనులు పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ స్థానికంగా అధికార పార్టీ నాయకుల వత్తిళ్ళకు తలొగ్గి సమస్యలు పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు మాత్రం అధికారపార్టీ నాయకులకొమ్ముకాస్తూ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించనందున 25నుంచి చేజర్ల తహసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. బిజెపినాయకులు కుంకుబాలయ్య,బత్తల కృష్ణయ్య,తెలబాటి వెంకటరామానాయుడుతదితరులు పాల్గొన్నారు.

## దీపావళి వేడుకలకు ముస్తాబు











ఫోటోలు నందా మాల్యాద్రి

## శ్రీచైతన్య పాఠశాల గుర్తింపు రద్దుచేయాలి




**కావలి అక్టోబర్23 ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నందుకు పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. శెలవుదినమైన ఆదివారం తరగతులను నిర్వహించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు నిరసన నినాదాల ప్రదర్శనతో కూడిన ధర్నా నిర్వహించారు. తరగతులలో నుంచి విద్యార్థులను బయటకు పంపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అజయ్ కుమార్, సూర్యప్రకాష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్, రాకేష్, శివకృష్ణ, జయదీప్, సాయి, రేవంత్, మనోజ్, ధనుష్, హనీఫ్, సాయికృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు. పుల్లారెడ్డి నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తుంగలో త్రొక్కిందన్నారు. శెలవురోజుల్లో కూడా విద్యార్థులకు తరగతులు నిర్వహించడం చట్టవిరుద్ధమన్నారు. అంతేకాకుండా ఇటీవల ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ఫీజు కట్టలేదని రూమ్‌లో బంధించిన సంఘటన కూడా జరిగాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ పాఠశాల యాజమాన్యంపై కఠినచర్యలు గైకొనాలని డిమాండ్ చేశారు.

## మురికి కూపంగా సంజీవరాజుపల్లి



**ఉదయగిరి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలో ఒకవైపు ఇంటింట పీవర్ సర్వే జరుగుతుంటే మరో వైపు జగనన్న స్వచ్ఛ సంకల్పం అంటు ప్రతిజ్ఞలు జరుపుకుంటున్నారు. సంజీవరావు పల్లిలో మాత్రం శుభ్రత గురించి పట్టించుకోవడానికి అక్కడి అధికారులకు హెల్త్ డిపార్ట్‌మెంట్ వారికి అవకాశమే లేనట్లున్నది. ఎక్కడిక్కడ మురుగునీరు నిలువతో దోమలు అధికమై అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. పంచాయితీ సచివాలయం అధికారులు ప్రజా ఆరోగ్యంపై పర్యవేక్షణ చూపలేక పోతున్నారు. ప్రస్తుతం అంటురోగాలు ప్రబలి గ్రామాంలో మంచాన పడుతున్న ప్రజలు ఎక్కువయ్యారు. సంజీవరాజుపల్లివైపు ఏ అధికారి కన్నెత్తి చూడలేదు. ఈ గ్రామంలో కి ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావాలింటరీలు, గ్రామంలోకి వచ్చిన దాఖలాలే లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంజీవరాజు పల్లిలో వ్యాధులకు కారణమైన మురుగు తొలగింపునకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వెంగళరావునగర్‌లో జగనన్న స్వచ్ఛ సంకాల్పనికి తూట్లు

**ఉదయగిరి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంగళరావునగర్ గ్రామంలో స్వచత కనుమరుగైందని, సచివాలయ సిబ్బంది కూడా అందుబాటులో లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు జగనన్న స్వచ్ఛ సంకల్పం అంటు నినాదాలు చేస్తు గ్రీన్ అంబాసిడర్లను ప్రతి సచివాలయం పరిధిలో నియమించి ఉన్నప్పటికి ప్రజలకు మాత్రం చెత్తనుండి విముక్తు కలగడం లేదని అంటున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నా ప్రస్తుత తరుణంలో ఇలా చెత్తను రోడ్డుపక్కన వదిలివేయడం ఎంతవరకు సమంజిసమంటు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడో ఒక్కసారి శుభ్రం చేసిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా నివాస గృహాలపక్కనే కుప్పలు వేయడం వల్ల అవికుల్లి దుర్గంధం వెదజలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్‌ని, సచివాలయ సిబ్బందని వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు చెబుతు జవాబు దాటవేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పసుపులేటి సుధాకర్ ఆర్థిక సహాయం



**కావలిరూరల్..అక్టోబర్23 ప్రభాతవార్త:** పసుపులేటి సుధాకర్ (పియస్ఆర్) చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల కావలి పట్టణానికి చెందిన విజయ్‌కుమార్ రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు చేయి విరగడంతో విషయం తెలుసుకున్న భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు మరియు పియస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సహకారంతో స్థానిక పియస్ఆర్ చారిటబుల్ ట్రస్టుకార్యాలయం నందు ఆదివారం ప్రతినిధులు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మరియు వారి కుటుంబ సభ్యులు పసుపులేటి సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పియస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మానవ హక్కుల గురించి అవగాహన కలిగిఉండాలి

**కావలి రూరల్ అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మానవ హక్కుల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకుని అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ అధ్యక్షులు కాసల కోనయ్య తెలియచేశారు. ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గొట్టిపాటి చిన్నసుబ్బానాయుడు కళ్యాణమండపం నందు ఆదివారం అవగాహన కార్యక్రమం రాష్ట్ర ఛైర్మన్ పత్తిపాటి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ఛైర్మన్ కాసల కోనయ్య మాట్లాడారు. 1210వ సంవత్సరంలో బ్రిటన్ రాచరిక పాలనకు వ్యతిరేకంగా అక్కడున్న ప్రజలు మొట్టమొదట మానవహక్కుల కోసం తిరుగుబాటు చేయడం జరిగింది. ఈ తిరుగుబాటులో దాదాపు 30వేల మంది మృతిచెందడం జరిగిందన్నారు. 17వ శతాబ్దం వచ్చిననాటికి 40శాతం ప్రజలు చైతన్యవంతులయ్యారన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినపుడే దేశం, కుటుంబం అభివృద్ధి చెందుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలియచేయడం జరిగిందన్నారు. భారత దేశంలో మహిళలకు ఓటు హక్కు వచ్చిన సమయానికి అమెరికాలో అమెరికాలో మహిళలకు ఓటుహక్కు లేదన్నారు. మహిళలను ఇంకా ఈ సమాజం చిన్నచూపు చూస్తుందన్నారు. మహిళలు ముందుకెళ్లేందుకు వారి హక్కులను తెలుసుకుని బాధ్యతాయుతమైనటువంటి మంచి మెరుగైన జీవితం కొరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు కాని, పురుషులు కాని వారివారి హక్కులను తెలుసుకోవాలన్నారు. అండమాన్ నికోబార్ దీవులలో 12 జాతులు ఉంటే కేంద్ర ప్రభుత్వం 6 జాతులను మాత్రమే గుర్తించి మిగిలిన 6 జాతులు ఏమైపోయారన్నారు. సంఘ సభ్యులకు ఎవరికైనా ప్రమాదం జరిగినా ఆర్థిక సహాయం చేసేందుకు ఒక నిధిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిలా ఆత్మకూరు పట్టణంలో ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే అన్ని రకాలుగా రూ50లక్షలు ఆర్థిక సహాయం చేయించడం జరిగిందన్నారు. ఇలాంటివి మన సంఘం తరపున ఎందరికో సహాయం చేయడం జరిగిందన్నారు. భారతదేశం మొత్తం తిరిగి మానవహక్కుల గురించి తెలియచేస్తామన్నారు. నా చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి మానవ హక్కులను కాపాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ సలహాదారు కెవిఎంవి మూర్తి, ప్రాంచ్ ఇండియా ఛైర్మన్ రాజు, నేషనల్ యూనియన్ ఛైర్మన్ కాసాల సాయి శశిధర్, నెల్లూరు జిల్లా స్పెషల్ ప్రాసిక్యూటర్ ఆర్.జగదీష్, ఏపి తెలంగాణ కేంద్ర కమిటి ఛైర్మన్ లక్ష్మయ్య, నేషనల్ కోఆర్డినేటర్ పి.సుబ్బరాయుడు, కావలి మాజీ ఎజిపి పోట్లూరి శ్రీనివాసులు, సామాజిక ఉద్యమనేత తిరువీధి ప్రసాద్, నెల్లూరు జిల్లా ఛైర్మన్ అబ్దుల్ అలీం, మహిళా ఛైర్మన్ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 31 న లక్షదీపోత్సవం




**బుచ్చి అక్టోబర్ 23ప్రభాతవార్త:** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఈనె 31 వ తేది కార్తికమాస మొదటి సోమవారం లక్షదీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు ,ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు,ఆలయ ప్రధానార్చకులు గంగా శివప్రసాద్ తెలిపారు. ఆరోజు సాయింత్రం 5 గంటలకు దాతల సహకారంతో ఉచితంగా లక్షదీపోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకొని ఆ కార ్యక్రమంలో పాల్గోనాలని పిలుపునిచ్చారు.

## అనాధ బాలికకు దీపావళి కానుక



**కావలి రూరల్ అక్టోబర్ 23 ప్రభాతవార్త:** కావలి పట్టణ పరిసర ప్రాంతమైన బుడమగుంట గిరిజన ప్రాంతంలో తల్లిదండ్రులు లేక అమ్మమ్మ సంరక్షణలో ఉంటున్న చలంచర్ల మహిమ అనే 5సంవత్సరాల చిన్నారిని చదివించి సంరక్షించేందుకు కొద్దిరోజులు క్రితం బాధ్యత తీసుకున్న కావలి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ పద్మజ రెడ్డి ఆదివారం సంయుక్త సేవాసంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో పద్మజ నర్సింగ్‌హోమ్ నందు చిన్నారి మహిహకు దీపావళి కానుకగా నూతన వస్త్రాలు, టపాసులు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజరెడ్డి మాట్లాడారు. తల్లిదండ్రులు లేని చిన్నారిని తన వంతుగా చదివిస్తానని అలాగే సంరక్షణ కోసం అవసరమైన అన్నిసౌకర్యాలను సంయుక్త సేవాసంస్థ ద్వారా అందచేస్తామని తెలియచేశారు. మహిమకు తల్లిదండ్రులు లేని లోటు కలుగకుండా ఉండేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇటువంటి పిల్లలను ఆదరిస్తున్న సంయుక్త సేవాసంస్థ సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు.

## కొత్తపల్లిలో యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ త్రవ్వకాలు



**కావలిరూరల్ అక్టోబర్23 ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలోని చెరువులో యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ త్రవ్వకాలను గ్రామస్తులు అడ్డుకోవడం జరిగింది. ఈ త్రవ్వకాలను స్థానిక నేతల అండదండలతో రాత్రి పగలు అనే తేడా లేకుండా గ్రావెల్ మాఫియా ఎటువంటి అనుమతులు లేకుండా రెండురోజుల నుంచి జెసిబిల సహాయంతో పెద్దపెద్ద లారీలతో గ్రావెల్‌ను కావలిలోని ప్రైవేటు ప్లాట్లలోకి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందారు. చెరువు ప్రాంతంలో లోతైన త్రవ్వకాలు జరగడంతో మూగజీవాలకు ప్రమాదాలు పొంచిఉన్నాయన్నారు. అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని గ్రామస్తులు తెలియచేశారు.

## ఈబీసీ నేస్తంపై సచివాలయాల్లో సందడి



**కోవూరు,అక్టోబర్23 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఈబీసీ నేస్తం పథకం అమలు చేస్తున్న దృష్ట్యా దీనికి సంబంధించి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో 45 సంవత్సరాలు నిండిన మహిళలు దరఖాస్తు చేసేందుకు ఉవ్విల్లూరుతున్నారు. ఈ పథకం కింద 45 సంవత్సరాలు దాటి 60 సంవత్సరాల వయస్సు గల మహిళకు ప్రభుత్వం 15,500 రూపాయలను వారి వారి ఖాతాల్లో ఉచితంగా జమ చేయనుండడంతో దీనిపై మహిళల్లో ఆసక్తి నెలకొంది. ఈ పథకానికి సంబంధించి ఏయే ధృవీకరణ పత్రాలు అందజేయాలనే విషయమై 45 సంవత్సరాలు నిండిన మహిళలు వారి వారి పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లో సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా ఈ పథకానికి సంబంధించి ఏయే ధృవీకరణ పత్రాలు పొందాలో మహిళలకు వివరిస్తున్నారు.

## ప్రమాదకరంగా వేగూరు కాలువ



**కోవూరు,అక్టోబర్23 ప్రభాతవార్త :** నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు తిరుగాడుతూనే ఉంటాయి. దీంతో పాటు ఈ రహదారి పక్కనుంచి జాతీయ రహదారి కలిపే రోడ్డు కూడా ఉంది. అయితే ఈ ప్రాంతంలో వేగూరు కాలువకు సైడు గోడ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. దీనికి తోడు చీకట్లో ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ రహదారిగుండా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చేపపిల్లల కేంద్రం సమీపంలో ఉన్న వేగూరు కాలువ ప్రాంతంలో నెలకొంది. ప్రతిరోజూ రోడ్డుకిరువైపులా వందలాది వాహనాలు ప్రసయాణిస్తూనే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ వేగూరు కాలువకు ఇరువైపులా ఉన్న సైడు గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించి సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులుగానీ, డ్రైన్ శాఖ అధికారులు గానీ, ఆర్‌అండ్ బీ అధికారులు గానీ ఆశించిన మేర స్పందించిన దాఖలాలు లేవు. ఫలితంగా ప్రమాదాల బారిన ఈ ప్రాంతంలో అనేక మంది పడి గాయాలపాలైనారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువకు ఇరువైపులా సైడు కాలువలు నిర్మించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీ ధన్వంతరీ జయంతి వేడుకలు



**నెల్లూరు టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గ్రామీణ నాయి బ్రాహ్మణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని టౌన్ హాలులో ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లాలో వైద్య సేవల పరంగా నాయి బ్రాహ్మణులకు ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమ సంఘం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని నాయి బ్రాహ్మణుల ప్రముఖులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసులు మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ వర్గాల్లో ఏమైనా సమస్యలు ఉన్నా, విద్యార్థులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయడంలో, పేదరికంలో ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడంలో సంక్షేమ సంఘం అండగా నిలబడి పరిష్కార మార్గం చూపుతుందన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన గ్రామీణ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఏర్పాటులో ధన్వంతరి జయంతి వేడుకలను జయప్రదం చేయడంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ కందుకూరు చంద్రశేఖర్‌ను ఈ సందర్భంగా వక్తలు, ప్రముఖులు, సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలగురుస్వామి, సీనియర్ నాయకులు కిన్నెర మాలకొండయ్య, ప్రముఖ ఈఎన్‌టి వైద్యులు రాహుల్‌బాబు, జిల్లా అధ్యక్షులు గోవిందస్వామి, ఉపాధ్యక్షులు డాక్టర్ కందుకూరు మస్తాన్‌బాబు, ప్రధాన కార్యదర్శి వినుకొండ అనిల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడుకొండలు, ట్రెజరర్ విజయభాస్కర్, సభ్యులు టి.శివప్రసాద్, వై.రమేష్‌బాబు, మహిళా నాయకురాలు త్రివేణి, సుధా, నటరాజ్, మరో వంద మంది నాయి బ్రాహ్మణ గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ బిఎస్పీని విజయవంతం చేయండి



**నెల్లూరురూరల్, అక్టోబరు23 ప్రభాతవార్త:** రూరల్ పరిధిలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఇన్‌చార్జ్, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త బి.శ్రీరామ్ పిలుపునిచ్చారు. రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంబేటి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో చింతారెడ్డిపాళెం మజారా సౌత్‌రాజుపాళెం గ్రామంలోని గౌతమ్‌నగర్‌లో ఆదివారం ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ, రూరల్‌లో బిసిలు అధికంగా ఉన్నారన్నారు. గత 75ఏళ్ళుగా చట్టసభల్లో ప్రతినిధ్యం లేకుండా బిసిలు అణగదొక్కబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలు ఈమేరకు అవగాహనతో మెలగాలన్నారు. బహుజనులను చట్టసభలకు పంపించడమే లక్ష్యంగా రూరల్‌లో ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బహుజనులు రాజకీయ చైతన్యవంతులు కావాలని సూచించారు. బియస్పీ రూరల్ పార్టీ అధ్యక్షులు ఇండ్ల శివయ్య, ఇన్‌చార్జ్ తాటిపర్తి పెంచలప్రసాద్, ఉపాధ్యక్షులు కోలగట్ల జయరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు మలపాటి మురళి, కోశాధికారి కోలగట్ల పోలయ్య, మీడియా ఇన్‌చార్జ్ ఎంబేటి నారాయణస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగిల్ నంబర్లు, క్రికెట్ బెట్టింగ్‌ల్లో నంబర్‌వన్ అనిల్‌కుమార్



**నెల్లూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త-వైద్యం:** సింగిల్ నంబర్లు ఆట, క్రికెట్ బెట్టింగ్‌ల్లో నంబర్‌వన్ సిద్ధహస్తుడు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కప్పిర.రేవతి ఆరోపించారు. ఆదివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ నగరంలో అనిల్ బార్లలో అవినీతికి పాల్పడి 24 గంటలు బార్లు తెరచిఉంచేందుకు పర్మిషన్లు ఇవ్వడమే కాకుండా మరలా ఇప్పుడు నగరంలో పొర్లుకట్ట, ములుముడి బస్టాండు, బిఈడీ కాలేజి సెంటర్, సంతపేట, నక్కలోళ్ళ సెంటర్లలో సింగిల్ నంబర్లాటలు, క్రికెట్ బెట్టింగులు ఆడిస్తున్నాడని ఆమె వెల్లడించారు. గతంలో ఈ జిల్లా ఎస్పీ రామకృష్ణ ఉన్నప్పుడు నీ బాబాయి, నువ్వు క్రికెట్ బెట్టింగుల్లో మీ ఇద్దరి హస్తం ఉందని నగరం మొత్తం కోడైకూసిందని అది నిజం కాదాని రేవతి ప్రశ్నించారు. మంత్రిగా ఉన్నప్పుడు ఇసుక, బార్లు, మైనింగ్, లేఅవుట్లలో దోచుకున్న ధనాన్ని జగన్‌కి వాటా ఇవ్వలేదనే అనిల్‌ని మంత్రి పదవి నుంచి జగన్ తొలగించారని రేవతి ఆరోపించారు. అవినీతికి నువ్వు పాల్పడకపోతే దుబాయ్‌లో షాపింగ్ కాంప్లెక్స్, చెన్నైలో ఇల్లు ఇవన్నీ ఎక్కడ నుంచి వచ్చాయని, నువ్వేమైనా మైసూర్ మహరాజ సుపుత్రుడివాని ఆమె ధ్వజమెత్తారు. గతంలో నువ్వు మంచివాడివనే ఆలోచనతో ఆనం వాళ్ళు నిన్ను చేరదీస్తే వారినే వెన్నుపోటు పొడిచి, వెన్నుపోటు పొడవడంలో నువ్వు ధిట్ట అని నిరూపించుకున్నావ్. నువ్వు ఒక ఆడదానిని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే టిక్కెట్టు తెచ్చుకున్న సంగతి మాకు తెలుసని ఆమె గుర్తుచేశారు. నారాయణని చీకటి మంత్రని పేరుపెట్టిన నువ్వు నువ్వు మంత్రి అయిన తరువాత ప్రజల ధనాన్ని దోపిడి చేయడమే పనిగా పెట్టుకుని ప్రజల బాగోగులు మరచి ఆ సమయంలో ఎక్కడ కనిపించకుండాపోయి నేడు గడప గడపకు అని రావడం విడ్డూరంగా ఉందన్నారు. బార్ల విషయంలో నువ్వు నిజాయితీపరుడివైతే ఇప్పుడు సింగిల్ నంబర్లు ఆడించేవారి దగ్గర అనిల్ రోజుకి రూ.2500 వసూలు చేస్తున్నాడని, ఇది పోలీసులకు తెలిసి జరుగుతుందో, తెలియకుండా తేలాల్సి ఉందన్నారు. దీని కంటే కొత్త సంగతి ఒకటుందని దీపావళి సందర్భంగా రోడ్లపై క్రీడా మైదానాల్లో ఎలాంటి నిబంధనలు లేకుండా బాణాసంచాను విక్రయించేందుకు అనుమతులు ఇచ్చి అందులో కూడా అనిల్ కమిషన్ అందుకున్నాడని ఆమె ఆరోపించింది. ఎమ్మెల్యేగారూ మీరు నిజంగా నిజాయితీపరుడైతే తక్షణమే బార్లలో ఎలాంటి అవినీతి జరగలేదని ఎలాంటి కమిషన్లు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా అనిల్ అని కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి సవాల్ చేశాడని, దానికి ఒక ఎమ్మెల్యేగా శివాలయంలో ప్రమాణం చేసి నీ నీతినిజాయితీని నిరూపించుకుని నగర ప్రజలకు తెలియచేయాలని ఆమె సూచించారు. నీ అవినీతిని ప్రశ్నిస్తే ఆడవాళ్ళని కొట్టించేది కూడా ఒక మగతనమేనా అనిల్ అని, అంతకంటే నువ్వు ఇంకేమి చెయ్యగలవనిఆమె అన్నారు. ఈ మధ్యకాలంలో నువ్వు టీడీపీలోకి వచ్చేందుకు మా నాయకులతో మంతనాలు చేశావో కూడా మాకు తెలుసు. మంత్రిగా ఉన్న సమయంలో దండకాలు తప్ప నగరాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలే లేవన్నారు. స్క్రిప్టు రాసిచ్చి పెయిడ్ ఆర్టిస్టులు లాంటి వారి చేత ప్రెస్‌మీట్లు పెట్టించడం నిజాయితీ అనిపించుకోదని, నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రమాణం చేస్తానని చెప్పిన మాటకు కట్టుబడి ఆ మాటను డైవర్ట్ చేయకుండా ప్రమాణం చేసి నీ సత్తా ఏమిటో నిరూపించుకోవాలని రేవతి సవాల్ చేశారు. ఈ సమావేశంలో సిటీ అధ్యక్షురాలు కమ్మ.కళ్యాణి, కొల్లూరి.విజయ, సీహెచ్.శాంతమ్మ, సీహెచ్.వేణుమాధవి, పి.లత, ఎం.మంజుల, సీహెచ్.నాగమణి, రామతులసి, కె.శ్రీలక్ష్మి దీపావళి పండుగను ఇంటిల్లిపాది హాయిగా, సుఖసంతోషాలతో జరుపుకోవాలని, జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి జిల్లా ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## మాతంగి కృష్ణపై దాడికి నిరసిస్తూ ధర్నా




**నెల్లూరు టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** ఇటీవల దళితనాయకుడు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణపై జరిగిన దాడికి నిరసిస్తూ నెల్లూరు నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో ఉన్న బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహం వద్ద పలువురు దళిత నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యూనిటెడ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు వేగూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే మాతంగి కృష్ణ లాంటి నాయకునిపై దాడులు జరపడం సహించరానిదన్నారు. ఈ దాడిని నిరసిస్తూ భారీ ఎత్తున మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారంటే కృష్ణ ఎంతటి గొప్ప నాయకుడో అర్థమవుతుందన్నారు. మాతంగి కృష్ణ జిల్లాలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, దౌర్జన్యాలను, మోసాలను ఎండగడుతూ వీటిని గట్టిగా ప్రశ్నించినందువలనే కిడ్నాప్ చేసి అతి కిరాతకంగా దాడి చేశారని, ఈ ఘటన ఆటవిక చర్యను తలపిస్తుందన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మా దళిత సంఘాల తరపున తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సంఘటనపై విచారణ చేసి ఐపిసి సెక్షన్ 307 కింద కేసు ఫైల్ చేసి వెంటనే నిందితులను అరెస్టు చేసి శిక్ష పడే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు రఘురామ్, గోవింద్ సూరి, వెంకటరమణ, మాతంగి నరసింహులు, ప్రసాద్, ఆరుమూళ్ల సురేంద్ర, చిన్న ఆంజనేయులు, బుజబుజనెల్లూరు, 25వ డివిజన్ నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి-కలెక్టర్ల దీపావళి శుభాకాంక్షలు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త** జిల్లా ప్రజలకు రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌భాబులు వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజ యమే దీపావళి పర్వదినమన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దీపావళి పండుగ ప్రజల జీవితాలలో మరిన్ని వెలుగులు నింపాలని..రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడం శుభపరిణామని ఆ ప్రకటనలో పేర్కొన్న ఆయన దీనితో పుష్కలంగా పంటలు పండి అన్నదాతలు ఆనందంగా జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా వుండాలని మంత్రి విడుదల చేసిన ప్రకటనలో ఆకాంక్షించారు. ఇక జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు జిల్లా ప్రజలందరికీ దీపావళి సరికొత్త శుభాలు అం దించాలని..ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి ఫలాలలు సంతృప్తికరస్దాయిలో లభించి ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని రెండు జలాశయాలలో నీరు పుష్కలంగా వుందని ఆ ప్రకటనలో పేర్కొన్న కలెక్టర్ తాగు, సాగునీటి అవసరాలకు ఎటువంటి ఢోకా లేదని. .రామాయపట్నం, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్, నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ధర్మల్‌పవర్ స్టేషన్ మూడవయూనిట్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలలతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడం శుభపరిణామమన్నారు.

## చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి



**ఆత్మకూరు, అక్టోబర్23, ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి అని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మనమంతా దీపావళిని సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అవనిలో ఉన్న సర్వ మానవులకు ఆనందాన్ని కలిగించే విజయాన్ని అందించి అజ్ఞానపు చీకట్లను పారద్రోలే విజ్ఞాన దీపాల తేజోత్సవం దీపావళి పండుగ అని పేర్కొ న్నారు.నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో తగిన జాగ్రత్తలు తీసు కుంటూ ఆనందంగా దీపావళి పండుగను అత్యంత ఘనంగానిర్వహించుకోవాలని కోరారు.







## అంకాలమ్మతల్లికి పొంగళ్ళు



మర్రిపాడు, అక్టోబర్23, ప్రభాతవార్త: మర్రిపాడు మండల కేంద్రంలో వెలసి యున్న అంకాలమ్మ దేవాలయంలో ఆదివారం ఆలయ ధరకర్త మాడుపూరి వెంక టేశ్వర్లు నాయుడు గ్రామస్తుల ఆధ్వ ర్యంలో అమ్మవారి ఉత్స వాలను అంగరంగ వైభంగా నిర్వహించారు. అమ్మ వారికి పొంగళ్ళు పెట్టి నైవేధ్యం సమర్పిం చారు. గ్రామ దేవత పొంగళ్ళలో గ్రామ పెద్దలు , యువకులు, భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు .







## వవ్వేరు బ్యాంకుపై సమగ్ర విచారణ జరపాలి



**బుచ్చి అక్టోబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంకు పైన వస్తున్న ఆరోపణలపైన సమగ్ర విచారణ జరపాలని తెలుగుదేశం పార్టీ జిల్లా రైతు విభాగం నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ కనీ వ్వనర్ కన్వీనర్ ఎం.వి శేషయ్య,జిల్లా బిసి నాయకులు బత్తల హరికృష్ణా జూగుంట పురుషోత్తమ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కోవూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదేశానుసారం, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దిశానిర్దే శంతోఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.2019లో ఇదే విధంగా వవ్వేరు బ్యాంకు చైర్మెన్‌పైన ఆరోపణలు వస్తే అపట్లో అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపారని వారు విమర్శించారు.ప్రస్తుతం 2 కోట్లా 7 లక్షలు బంగారం పెట్టకుండా ఖాళీ సంచులు పెట్టి నగదు తీసుకున్నారన్న ఆరోఫణలు వస్తున్నాయని దానిపైన సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వవ్వేరు బ్యాంకుకు ఎంతో చరిత్ర వుందని బ్యాంకును నము ్మకొని ఉద్యోగులు,రైతులు వున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో పేరున్న బ్యాంకు వవ్వేరు బ్యాంకు అని అన్నారు.ఒకసారి తప్పు చేశారు అన్న ఆరోపణలు వచ్చిన వారిని మరలా త్రిసభ్య కమీటి చైర్మన్‌గా వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలుగ జేసుకోని త్రిసభ్య కమీటిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అవినీతిని ప్రశ్నిస్తే గ్రామాలలో తిరగనివ్వకుండా చేస్తామని వైసిపి నాయకులు చెప్పడం దారుణమని నాయకులు ఖండించారు.బ్యాంకు పై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి బ్యాంకును కాపాడాలని,త్రిసభ్య కమీటిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు టౌన్ అద్యక్షులు తాళ్ల నరసింహస్వామి,క్లష్టర్ ఇన్‌చార్జి బండ్ల కొండయ్య, దుగ్గిశెట్టి హరినాద్, నెల్లూరు దయాకర్‌రెడ్డి, ఇప ్పగుంట సుధాకర్‌రెడ్డి,వల్లూరు శ్రీనివాసులు,దశరద్, మైనార్టీ నాయకులు చోటు,అహ్మద్‌భాషా, షబ్బీర్,అక్తర్, మాల్యాద్రి,ఉసురుపాటి ప్రసాద్,మీరావళి, పలువురు టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## జలదంకిలో భక్తిశ్రద్దలతో పోలేరమ్మ పొంగళ్ళు



జలదంకి, అక్టోబర్23, ప్రభాతవార్తః మండలకేంద్రమైన జలదంకిలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ తల్లి పొంగళ్ళు భక్తిశ్రద్దలతో నిర్వ హించారు. గ్రామానికి చెందిన వడియరాజులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టాలని సంకల్పించారు. అందులోభాగంగా అందరూ స్తానిక ఆర్. టి.సి బస్తాండ్‌కూడలినుంచి ఊరేగింపుగా,బా ణా సంచాపేలుళ్ళు, డప్పు వాయిద్యాల మద్య కదిలారు.కట్టకింద అమ్మవారి గుడివద్దకు చేరుకొని ప్రత్యేకపూజలు చేశారు.నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

## నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు



కోవూరు, అక్టోబర్23 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తెచ్చేలా నాడు-నేడు పథకంతో వాటి రూపురేఖలే మార్చివేశారని సర్పంచ్ కె. వెంకటరమణారెడ్డి తెలిపారు. కోవూరు మండలం మోడేగుంట గ్రామంలో 24 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న అదనపు గదులకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారన్నారు. ముఖ ్యంగా అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



**ఆత్మకూరు, అక్టోబర్23, ప్రభాతవార్త:** అంతరంగంలోని అజ్ఞానపు చీకట్లను పారద్రోలి ప్రజలంతా ఆనందంగా దీపావళి పండుగను జరుపుకోవాలని నెల్లూరుపార్లమెంట్ మాజీ పభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొ న్నారు. జిల్లా ప్రజలకు ఆయన దీపావళి పర్వదినం సందర్భంగా శుభా కాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలు సిరిసంపదలతో అష్టైశ్వర్యాలతో తుల తూగాలన్నారు. ఆనంద దీపావళి వెలుగులునిపేందిగా ఉండాలని, మీ జీవితాలు ప్రకాశించేలా అందరూ జాగ్రత్తగా పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు. దుష్టశక్తులను పారద్రోలి కొంగొత్త జీవితానికి స్వాగతం పలికే దీపావళి పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**నెల్లూరురూరల్, అక్టోబరు23 ప్రభాతవార్త** రూరల్ పరిధిలో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహనరెడ్డి ఆదే శాల మేరకు రూరల్ పరిధిలో రెండవ విడత గడపగడపకూ - మనప్రభుత్వం కార్యక్రమం ఆదివారం 22వడివిజన్‌లో ము గింపు సంద ర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమా వేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, రూరల్ నియోజ కవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామి ఇచ్చా రు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మ్యూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి 24గంటలూ అందుబాటులో ఉంటామన్నారు. స్థానిక కార్పోరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోళ్ళలో రూ.వెయ్యికోట్ల మేర అవినీతి



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 23 ప్రభాతవార్త** జిల్లాలో ధాన్యం కొను గోళ్ళ ప్రక్రియలో రూ. వెయ్యికోట్ల రూపాయల మేర అవినీతి జరిగిం దని. ఇందులో ఐఏఎస్ అధికారుల పాత్ర కూడా వుందని డిస్ట్రిక్ట్ ఫార్మ ర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బెజవాడ గోవిందరెడ్డి ఆరోపిం చా రు. ఆదివారం నెల్లూరులో జరిగిన జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో పాల్గొన్న ఈ మేరకు ఆరోపణలు చేయడంతోపాటు జరిగిన అవి నీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని లిఖితపూర్వకంగా సమావేశంలో పాల్గొన్న వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అం దజేశారు. జిల్లాలో 2018-19లో జరిగిన ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియలో రూ. 100 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందన్న గోవిందరెడ్డి సాక్షాత్తూ కలెక్టర్-జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికా రులు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం తోలిన రైతులకు ఇవ్వాల్సి న బకాయిలు చెల్లించలేదన్నారు. దీనిపై తామి చ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వం విచారణకు ఆదేశించగా ఎటువంటి విచారణ చేపట్టకుండానే 13 మంది రైస్‌మిల్లర్లపై క్రిమినల్‌కేసులు పెట్టి.. క్రిందిస్ధాయి ఉద్యోగులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకు న్నా రన్నారు. ఆ సమయంలోనే పౌరసరఫరాలశాఖ కార్యాలయంలోని రికార్డులను,కంప్యూటర్ ఆనవాళ్లను తగుల బెట్టారన్న బెజవాడ గోవిందరెడ్డి మరో రూ. 900 కోట్ల రూపాయలు రైస్‌మిల్లర్ల బ్యాంక్‌ఖాతాల్లోకి అక్కడి నుండి అధికారుల బంధువులు, అనుచరుల ఖాతాలలోకి బదిలీ చేశారన్నారు. ఇక తాజాగా మరో రూ. 30 కోట్ల మేర నిధులు పక్కదారి పట్టాయన్న ఆయన ఇందులో చిన్నస్ధాయి అధికారుపైకి నేరం నెట్టేసి పైస్థాయి అధికారులు తప్పించుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ధాన్యం కొనుగోళ్లు...సీఎంఆర్... రైతులకు చెల్లించాల్సి న ధాన్యం బకాయిలు..గోడవున్ల అద్దెలు..హమాలీల కూలీలకు సంబంధించిన ఈ నిధులు పక్కదారిపట్టడంలో ఐఏఎస్ అధికారుల పాత్ర వున్న నేపథ్యంలో దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని బెజవాడ గోవిందరెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## లోన్ యాప్‌ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి



**కోవూరు, అక్టోబర్23 ప్రభాతవార్త** : లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని ప్రజలెవ్వరూ ప్రమాదాల భారిన పడవద్దని కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి తెలి పారు. కోవూరు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సులు వుగా రుణాలు ఇస్తారన్న కారణంతో రుణ యాప్‌లకు ఆకర్షితులై ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. తక్కువ వడ్డీ రేటు అంటూ తొలుత ఊరింపులు , ఆకర ్షణలు ఉంటాయని, రుణాలు తీసుకున్నాక ఊహించని వడ్డింపులు, అధిక వడ్డీ లు, కనిపించని ఛార్జీల పేరిట యాప్ నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు గుంజేందుకు సిద్దమవుతున్నారన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు రుణాలు తిరిగి చెల్లించే విషయంలో యాప్ నిర్వాహకులు స క్రమంగా వ్యవహరించడం లేదన్నారు. ఇలాంటి వ్యక్తులు, సంస్థలు నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఈ రుణాల విషయంలో వేధింపులకు గురైతే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గానీ, 1930 నంబర్‌కుగానీ సమాచారం అందించాలన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు పొందిన బ్యాంకులు , నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలు చెప్పుడు మాటలు విని తమ వ్యక్తిగత సమాచారం , బ్యాంక్, ఆధార్ సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎవరితో షేర్ చేసుకోవద్దన్నారు. అదేవిధంగా మొబైల్‌లో డేటా దొంగిలించే అనధికార యాప్‌ల జోలికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లరాదని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఘనంగా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ భవనం ప్రారంభం



**నెల్లూరు టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలో మొట్టమొదటిసారిగా యాదవుల భవనము ఆదివారం నాడు నెల్లూరు, పొదలకూరు రోడ్డులోని కొత్తూరు నందు ప్రారంభమైనది. 32 అంకణముల స్థలంలో, ఒక అంతస్తు భవనమును తన సొంత నిధులతో నగర శాసనసభ్యులు పి.అనిల్‌కుమార్‌యాదవ్ నిర్మించి యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి అప్పజెప్పడం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులందరూ తమ పిల్లలను బాగా చదివించాలని, విద్య ద్వారా మాత్రమే అభివృద్ధి సాధిస్తారని తెలియజేశారు. యాదవులకు ఎలాంటి సమస్య వచ్చిన నా పరిధిలో సమస్య పరిష్కారానికి తన వంతు ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనమండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ యాదవులందరూ ఐకమత్యంగా ఉండి అన్నిరంగాలలో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా యాదవ భవనాన్ని నిర్మించిన ఘనత యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి దక్కిందని కార్యవర్గ సభ్యులను అభినందించారు. యాదవ విద్యార్థులకు హాస్టల వసతికి ఏర్పాటు... ఆల్ఫా హేచరీస్ అధినేత దూడల సుధాకర్ యాదవ్ యాదవ విద్యార్థులకు ఉచితంగా ఒక అంతస్తు భవనము నిర్మించి హాస్టల్ వసతి ఏర్పాటుకు విరాళము ప్రకటించారు. వైఈఎస్ వ్యవస్థాపకులు జి.శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శి కె.మల్లికార్జున, ఉపాధ్యక్షులు పి.వెంగయ్య, రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, పి.శ్రీ నివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, అక్టోబర్23 ప్రభాతవార్త** : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ సేవలను గ్రామస్తులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జలజీవన్ మిషన్‌పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ ఈ మిషన్ వ్యవహారంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పడుగుపాడు పంచాయతీ పరిధిలో ఈ జలజీవన్ మిషన్ సేవలు వేగవంతం అయ్యేందుకు సమిష్టి బాధ్యత అవసరమన్నారు. ఈ సందర ్భంగా జలజీన్ మిషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వివి సీహెచ్ శర్మ జలజీవన్ మిషన్ యొక్క ఆవశ్యకత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ వైస్ చైర్మన్ వి. రాఖీ, ఉపసర్ప ంచ్ షేఖ్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, లవకుమార్‌రెడి , జలజీవన్ మిషన్ డైరెక్టర్లు, పంపు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## నూతన చర్చి ఏర్పాటుపై భారీ నిరసనలు

**కావలి అక్టోబర్23 ప్రభాతవార్త** కావలి పట్టణ పాతవూరు దగ్గర నూతన చర్చి ఏర్పాటుకు వ్య తిరేకంగా జనం నిరసనలు వ్యక్తం చేశారు. ఆదివారం కావలి ఉషానర్సి ంగ్‌హోమ్ వద్ద జనం రోడ్డుపై బైఠాయించి చర్చి ఏర్పాటుపై నిరసన నినాదాలు చేపట్టారు. ఉషానర్సి ంగ్‌హోమ్ నిర్వా హకులు నూతన చర్చి ఏర్పాటుకు ఇల్లు అద్దెకివ్వడాన్ని నిరసించారు. ఈ నూతన చర్చికి వివిధ ప్రాంతాల నుంచి మనుషలను తరలించి ప్రార్థనలు చేసుకోవడం ఏమిటని వారు దుయ్యబట్టి అడ్డుకున్నారు. బలవంతపు మన మార్పిడులు సహించేది లేదంటూ నినాదాలతో ఆ ప్రాంతంలో హోరెత్తించారు. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ చర్చి నిర్వాహకులకు వార్డుప్రజలకు మద్య వాగ్వివాదం జరిగింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చర్చిని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ చర్చి ఏర్పాటుకు ఇల్లు అద్దెకు ఎలా ఇస్తారని ఉషానర్సి ంగ్‌హోమ్ నిర్వాహకులను నిలదీశారు. పోలీసులు విచారణ చేసి చర్యలు చేపడతామని ఇచ్చిన హామీతో నిరసనలకు స్వస్తి చెప్పారు.